www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్
Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వుల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 10 | 04-12-2023 | పుటలు : 4

## నన్నయలో ఎన్.ఐ.ఆర్.ఎఫ్ కార్యశాల

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, నాణ్యత హామీ విభాగం,ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సంయుక్త నిర్వహణలో నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ 2024 పేరిట ఒకరోజు కార్యశాల విశ్వవిద్యాలయ సెమినార్ హాల్లో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ ఉపపతి ఆచార్య కె.పద్మరాజు విశిష్ట అతిథిగా ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్, నాణ్యత హామీ విభాగం డైరెక్టర్ ఆచార్య కె. రామ్మోహనరావు, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ప్రత్యేక నాణ్యత హామీ విభాగం ఎకడమిక్ ఆఫీసర్ జి.శ్రీరంగం మాథ్యూ రిసోర్స్ పర్సన్ గా లయోలా కాలేజ్ చెన్నై డా.ఆర్. రవీంద్రన్ పాల్గొన్నారు. అకడమిక్ ఆఫీసర్ మాథ్యూ  మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్య మరియు ఆరోగ్యం పైన దృష్టి పెట్టిందని రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలోని కళాశాలల ఐక్యుఏసి డైరెక్టర్లతో ఇటువంటి కార్యశాలలను నిర్వహిస్తున్నామని ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ లో అవగాహన కలిగిస్తున్నామని ఇది భవిష్యత్తులో ప్రతి విద్యా సంస్థకు చాలా ముఖ్యమని తెలియజేశారు. ఈ వర్క్ షాప్ లో కీలకోపన్యాసం చేసిన ఆచార్య కె.రామ్మోహనరావు మాట్లాడుతూ ఈ రాంకింగ్ విధానం 2016 ప్రారంభమైందని ఇందులో 11 విభాగాల ద్వారా రిజిస్ట్రేషన్స్ ఉంటాయని ఇప్పుడు ఈ ర్యాంకింగ్ లో పాల్గొనే వారి సంఖ్య పెరిగిందని ప్రతి విద్యా సంస్థ న్యాక్ గుర్తింపుతో పాటు ర్యాంకింగ్ పై కూడా దృష్టి పెట్టాలని అలాగే విద్యాసంస్థల్లో పరిశోధనా పత్రాల తయారిపై కూడా దృష్టి నిలపాలని అటువంటి







పరిశోధక అధ్యాపకులకు ఆర్థిక సహకారాన్ని మేనేజ్మెంట్ లేదా అడ్మినిస్ట్రేషన్ అందిస్తే మెరుగైన పరిశోధనలు వస్తాయని అన్నారు. ఈ ర్యాంకింగ్ విద్యాసంస్థల మధ్య పోటీని పెంపొందిస్తుందని విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్యాసంస్థలు తయారవుతాయని చెప్పారు. ఉపకులపతి ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం కలిగిన నాలుగు నగరాల్లో రాజమహేంద్రవరం ఒకటని, వేయి సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన రాజమహేంద్రవరం నగరంలో 11వ శతాబ్దానికి చెందిన ఆదికవి నన్నయ పేరిట విశ్వవిద్యాలయం వెలిసి ఉభయగోదావరి జిల్లాల విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని, గ్లోబలైజేషన్ కి అనుగుణంగా, మారుతున్న కాలానికి తగిన విధంగా కోర్సులను అందిస్తూ విశ్వవిద్యాలయం ప్రభుత్వ సహకారంతో సేవలు అందిస్తుందని, గత ఆరు నెలలుగా వివిధ సంస్థలతో ఎం.ఓ.యు ఒప్పందాలను కుదుర్చుకున్నామని ఇవన్నీ విశ్వవిద్యాలయ ర్యాంకింగ్ ని పెంచే విధంగా ఉంటాయని, విద్యార్థులకు ఉపాధి అవకాశాల వైపుకి వెళ్లడానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, రిసోర్స్ పర్సన్ రవీంద్రన్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ విధివిధానాల గురించి అవగాహన కలిగించారు. ఉత్తరాంధ్ర మరియు గోదావరి జిల్లాల పిజి డిగ్రీ ఫార్మసీ ఇంజనీరింగ్ కి చెందిన వివిధ కళాశాలల నుండి 163 మంది ఐక్యూఏసి కోఆర్డినేటర్స్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.ఈ కార్యశాలకు విశ్వవిద్యాలయ ఐక్యూఏసి డైరెక్టర్ డా.వి. పెర్సిస్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

## కాకినాడ క్యాంపస్‌లో రాజ్యాంగ దినోత్సవం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ మరియు పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ డా ఎం.శ్రీదేవి మరియు  పొలిటికల్ సైన్స్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ హెచ్ ఓ డి డా.జోసెఫ్ స్టీఫెన్ ఇరువురి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్యాంపస్ లో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మరియు క్యాంపస్ స్థలదాత మల్లాడి సత్యలింగం నాయకర్ విగ్రహాన్ని పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "రాజ్యాంగం భారతదేశ ఔన్నత్యానికి ఎంతగానో సహకరిస్తుందని దీనిని రచించిన డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అణగారిన  వర్గానికి చెందిన ఒక వ్యక్తి అయినప్పటికీ ఎన్నో కష్టాలు పడి ఉన్నత విద్యను అభ్యసించి భారత రాజ్యాంగం వంటి ఒక గొప్ప గ్రంథాన్ని విజయవంతంగా రచించి దేశ దిక్సూచిగా అయ్యారని, అటువంటి మహానుభావుల యొక్క కృషి ని ప్రతి ఒక్క విద్యార్థి స్ఫూర్తిగా తీసుకొని భారతదేశ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించవల్సిందిగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు". ఎంబీఏ ద్వితీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు వెన్నెల మరియు దివ్య జాతీయ రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు సందేశాన్ని  ను అందించారు. పొలిటికల్ సైన్స్ విద్యార్థి ని మల్లేశ్వరి మన దేశ ప్రియాంబుల్ ను చదివి అందరిచే ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో డా.పోచయ్య, డా.అజయ్ రతన్, డా.హారిక, డా.నాని బాబు, డా. రామరాజు, డా.హరిబాబు, డా. అప్పారావు, డా.గోపి తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



### మంచిమాట



# సంపాదకీయం



## కవిత్వం ఎందుకంటే

కవిత్వం ఒక ఆల్కెమీ.దాని రహస్యం కవికే తెలుసు. పెద్దన్నకు తెలుసు. కృష్ణశాస్త్రికి తెలుసు. శ్రీశ్రీకి తెలుసు... అన్నారు తిలక్.ఆల్కెమీ అంటే స్పర్శవేది. నీచలోహాన్ని బంగారంగా మార్చేవిద్య. కవిత్వం కూడా స్పర్శవేదే.సమాజాన్ని అందంగామార్చే పనిలో ఉంటుంది. విశ్వమానవ శ్రేయస్సును కోరుకుంటూ మనిషి మనుగడ కోసం పరితపిస్తూ ఉంటుంది. అందుకనే కవిత్వం సమాజంలో అంతర్లీనంగా ప్రవహించే ఒక జీవశక్తి.దాని అంతిమ ప్రయోజనం సామాజిక స్పృహ.జగత్కళ్యాణం దాని లక్ష్యం. అది ప్రచార సాధనం కాదు. ఒక కరపత్రం.దాని మార్గం,దాని ఉద్దేశం,దాని ప్రయోజనం వేరు. సమాజాన్ని ఒక తాటి మీద నడిపించటం దాని మార్గం. మనిషి జీవితాన్ని లోతుగా వ్యాఖ్యానించటం దాని ఉద్దేశం. మనుషులంతా ఒకటి కావాలన్నది దాని ప్రయోజనం.

సమాజ పురోగమనంతోనే మనిషి అభివృద్ధి చెందుతాడని కవి నమ్ముతాడు కాబట్టి దానికి అనుకూలంగానే కవిత్వం రాస్తాడు. కవి సామాజికవాది. తన చుట్టూ ఉన్న సమాజాన్ని గమనిస్తూ జరుగుతున్న సంఘటనల్ని అర్థం చేసుకుంటూ ఆ అనుభవాలలో ఇరుక్కున్న మనుషుల మనస్తత్వాలను పరిశీలించడంలోంచి ఒక వేదన, ఒక సంఘర్షణలోంచి కవిత్వం పుట్టుకొస్తుంది.

" హృదయం,మేధ కలిస్తేనే కవిత్వం" అంటారు కాల్రిడ్జ్. "కవిత్వం ఒక మెస్మరిజం. కవికన్ను ఒక ప్రిజం" అన్నారు శేషేంద్ర శర్మ. ఆ పట్టకంలోంచి చూస్తేనే ప్రపంచంలో అంతర్లీనంగా ఉన్న కనికట్టు కనిపిస్తుంది. కవి సంకల్పితమైన కావ్య ప్రపంచమంతా సుఖమయంగా, శుభావహంగా లోక శ్రేయస్సును కలిగిస్తుంది.

సమాజంలో వైషమ్యాల్ని తగ్గించి ప్రేమ ప్రపూరితమైన హృదయాన్ని ఆవిష్కరిస్తుంది. కవి సృష్టించిన కావ్య ప్రపంచం మానవ జీవితానికి ధర్మార్థకామమోక్షాలను సమకూరుస్తుంది. అందుకే కవి ఎప్పుడు ఉదార మానవతావాద వైఖరిని వదలడు. ఆకాశమంత విశాలమైన అంతరంగాన్ని కలిగి సామాజిక అవగాహన, రాజకీయ పరిశీలనతో మానవ స్వభావంలోని చిక్కుముడుల్ని లోతుగా పరిశీలించే తాత్విక లక్షణంతో ఉంటాడు. సమాజానికి న్యాయాన్ని, భద్రతను సమకూర్చే పనిలో ఉంటాడు. సమాజంలోని వాస్తవాలను కవితా సృజనకు ఉపయోగించుకుని మెరిసిన ఆలోచనలను ఒడుపుగా పట్టుకుని కవిత్వంగా అందిస్తాడు. నిరంతరం లోకాన్ని పరికించటం, జీవిత పోకడల్ని గమనించటం కవికి ఉండే లక్షణాలు. కవిత్వాన్ని బాధ్యతాయుతమైన విద్యగా కవి భావిస్తాడు. ఎందుకంటే కవిత్వం సామాజికమైన మార్పుకు ఎంత ప్రయోజనకారో సామాజిక విధ్వంసక మూలాలను చేదించటానికి అంతే ఆయుధంగా ఉపయోగపడుతుంది. దానిని ఎలా ఉపయోగించాలో ఆలోచిస్తాడు.

"రచన నాకు విలాసయాత్ర కాదు, అది ఒక సాహసయాత్ర"అంటారు మధురాంతకం నరేంద్ర. కవిత్వం మనిషిని స్తబ్దత నుంచి చైతన్యంలోకి నడిపిస్తుంది. నిశ్శబ్దంలో నుంచి నినాదం వైపుకు మళ్ళిస్తుంది. మనిషికి మంచిని నేర్పుతుంది. వికాసాన్ని కలిగిస్తుంది. న్యాయం వైపుకు నడిపిస్తూ సమసమాజ శాంతియుత సర్వ మానవ సమానత్వం కోసం పోరాడుతుంది. అందుకోసమే కవిత్వం.

## ఇంజనీరింగ్ విద్యార్థుల ఫ్రెషర్స్ ఫంక్షన్




ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఘనంగా ఫ్రెషర్స్ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ ఫ్రెషర్స్ పార్టీలు విద్యార్థులు ఆటపాటలు నృత్య ప్రదర్శనలతో ఆనందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వరరావు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.



## కాకినాడ క్యాంపస్ కార్తిక వన సమారాధనలో వీసీ దంపతులు



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతిశ్రీ అధ్యక్షతన వన సమారాధన కార్యక్రమాన్ని క్యాంపస్ ప్రాంగణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.పద్మరాజు దంపతులు మరియు విశిష్ట అతిథిగా ఓ ఎన్ జి సి జనరల్ మేనేజర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు. ముందుగా క్యాంపస్ లోని ఉసిరి చెట్టుకు పూజ చేశారు. అనంతరం ఉపకులపతి ప్రొఫెసర్ కె. పద్మరాజు గారు మాట్లాడుతూ మనం ప్రకృతి పట్ల ప్రేమని అవగాహనని కలిగి ఉండడానికి ఈ వన సమారాధన ఎంతగానో ఉపయోగపడుతుందని శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే క్యాంపస్ లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు డా.విజయనిర్మల , డా.నూకరత్నం, గంధం నారాయణరావు, కాకినాడ జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ సూర్య ప్రకాష్ , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐ ఎస్ డి పి దయాకర్, డిప్యూటీ డైరెక్టర్లు, క్యాంపస్ అధ్యాపకులు , అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు.

# ఘనంగా సైకాలజీ అంతర్జాతీయ సదస్సు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సొసైటీ ఫర్ కమ్యూనిటీ రీసెర్చ్ అండ్ యాక్షన్ మరియు విశ్వవిద్యాలయ స్పృహ సైకాలజీ అలుమ్ని అసోసియేషన్, సైకాలజీ విభాగం, రాజమండ్రి రోటరీ,










జిఎస్ఎల్ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నన్నయ విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. విజయనిర్మల అధ్యక్షతన ప్రారంభమైంది. ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె పద్మరాజు హాజరై మాట్లాడుతూ నిత్యజీవితంలో సైకాలజీ చాలా కీలకమైన అంశమని దానిని అందరూ అధ్యయనం చేస్తూ మానసిక ప్రశాంతత వైపుకు వెళ్లాలని అన్నారు. ఆత్మీయ అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు.

స్పోర్ట్స్ సైకాలజిస్ట్ పంజాబ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ "సంపూర్ణత ద్వారా శ్రేష్టత" అనే అంశం మీద కీలకోపన్యాసం చేశారు. హైదరాబాద్ అపోలో హాస్పిటల్ డాక్టర్ చెన్నంశెట్టి విజయకుమార్ "నిద్ర సమస్యలు ఆరోగ్యం" అనే అంశంపై ఉపన్యసించారు. 235 మంది డెలిగేట్స్ వివిధ సంస్థలు, కళాశాలల నుండి పాల్గొన్నారు.

రెండవ రోజు ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి విలువలు, సంప్రదాయాలు, సామాజిక సమైక్యత గురించి విశ్లేషణాత్మకంగా ప్రసంగించారు. డెర్మటాలజిస్టు డాక్టర్ రవి వాడ్రేవు హెల్త్ అండ్ కమ్యూనిటీ సైకాలజీ గురించి చర్చించారు. సొసైటీ ఫర్ కమ్యూనిటీ సైకాలజీ అధ్యక్షులు క్వాసీ బ్రూకెన్స్, బ్రాడ్లీ వాల్సన్ ఆన్లైన్లో ప్రసంగించారు.మీనా సెహగల్, సుంకర నాగేంద్ర కిషోర్ మరియు స్పృహ సభ్యులు వర్క్ షాప్ ను నిర్వహించారు విజయనగరం చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ మల్లా వెంకటేశ్వరరావు పిల్లల మానసిక స్థితిగతుల గురించి ప్రసంగించారు. ఈ సదస్సులో భాగంగా రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రిలే రన్నింగ్ పోటీలలో రాజమండ్రికి చెందిన నాలుగు స్కూల్స్ నుండి 400 మంది ఆడపిల్లలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నన్నయ మున్సిపల్ స్కూల్ విద్యార్థినులు ప్రథమ స్థానాన్ని పొందారు. సదస్సు కన్వీనర్ సుంకర నాగేంద్ర కిషోర్ తన తండ్రి పేరిట నెలకొల్పిన శ్రీ సుంకర భాస్కరరావు స్మారక క్రీడా జీవన సాఫల్య పురస్కారాన్ని స్పోర్ట్స్ సైకాలజిస్ట్ ఆచార్య జితేంద్ర మోహన్ కి ప్రదానం చేశారు. రెండు రోజుల సదస్సులో పంజాబ్ యూనివర్సిటీ కు చెందిన జితేంద్రమోహన్ స్పోర్ట్స్ సైకాలజీ కు సంబంధించిన ఎన్నో విషయాల గురించి ప్రసంగించారు. కన్వీనర్ సుంకర నాగేంద్ర కిషోర్ ని విశేషమైన అంతర్జాతీయ సదస్సును నిర్వహించినందుకు బిసి ఆచార్య కె.పద్మరాజు, పంజాబ్ యూనివర్సిటీ స్పోర్ట్స్ సైకాలజీ ప్రొఫెసర్ ఆచార్య జితేంద్రమోహన్, స్పృహ అలుమ్ని అభినందించారు. సదస్సు డైరెక్టర్ ప్రముఖ మానసిక వైద్య నిపుణులు కర్రి రామారెడ్డి,సదస్సు నిర్వహణకార్యదర్శి, స్పృహ సైకాలజీ అధ్యక్షులు, సొసైటీ ఫర్ కమ్యూనిటీ రీసెర్చ్ అండ్ యాక్షన్ ప్రాంతీయ సమన్వయకర్త సుంకర నాగేంద్ర కిషోర్ మరియు స్పృహ సైకాలజీ సభ్యులు శ్రీమతి గూడూరు రాధిక, రాజేష్ ఖన్నా,బాడిస శ్రీనివాస్,చండీప్రియ,సైకాలజీ విభాగం కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ నారాయణ నక్కిన, అధ్యాపకులు డాక్టర్ రాజశేఖర్ పడాల, డాక్టర్ కృష్ణ భవాని, పరిశోధక విద్యార్థులు, సైకాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.











## సదస్సు సంతృప్తినిచ్చింది



అంతర్జాతీయ సదస్సును నిర్వహించడానికి సహకరించిన స్పృహ అలుమ్ని సభ్యులకు, రోటరీ, జిఎస్-ఎల్ మరియు విశ్వవిద్యాలయ సైకాలజీ విభాగం అధ్యాపకులు, విద్యార్థులకు ధన్యవాదాలు. వీరంతా ఎంతగానో సహకరించారు. విలువైన పరిశోధన విషయాలను ఈ సదస్సు ద్వారా చర్చించడానికి అవకాశం కుదిరింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అధికారులు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. స్పృహ అలుమ్ని తరపున విశ్వవిద్యాలయంలో ఒక అంతర్జాతీయ సెమినార్ నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చింది.

**సుంకర నాగేంద్ర కిషోర్,**

**కన్వీనర్, ఇంటర్నేషనల్ సెమినార్ అండ్ వర్క్ షాప్.**

# భాషోద్ధారకుడు సి.పి. బ్రౌన్



చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 1798 నవంబర్ 10 న కలకత్తాలో జన్మించారు.తండ్రి మరణానంతరం కుటుంబం ఇంగ్లాండుకు వలస వెళ్లడంతో 1817లో ఈస్ట్ ఇండియా కంపెనీలో మద్రాస్ సివిల్ సర్వీస్ ఉద్యోగిగా చేరారు.ఆ రోజుల్లో ఉద్యోగ నిర్వహణ కోసం బ్రిటీష్ దొరలు ప్రాంతీయ భాషలు నేర్చుకునే వారు.దీనికోసం అప్పటివరకు తెలుగు భాష వినని సిపి బ్రౌన్ తదనంతర కాలంలో తెలుగు భాషాభిమానిగా మారి తెలుగు భాషకు చిరస్మరణీయమైన సేవలు అందించి,పతనం అయిపోతున్న తెలుగు భాషను పటిష్ట స్థితికి చేర్చారు.అందువల్ల తెలుగు ప్రజలందరూ సి.పి బ్రౌన్ కు ఎంతగానో రుణపడి ఉంటారు. తెలుగు సాహిత్యం కనుమరుగైపోతున్న కాలంలో,పండితులెవ్వరు తెలుగు భాషను పట్టించుకోని కాలంలో బ్రౌన్ దృష్టి తెలుగు భాష పై పడింది.1824లో ఆబే జే.ఏ యొక్క దుబాయ్ ఆంగ్ల రచనలో బ్రౌన్ దొర వేమన ప్రస్తావన గురించి చదివాడు. అంతే....మరుగునపడి కనుమరుగవుతున్న వేమన పద్యాలను సేకరించడం ఒక ఉద్యమంగా చేశారు.ఐదు సం.అహర్నిశలు శ్రమించి 1929లో వేమన పద్యాలకు ప్రాణప్రతిష్ట చేసి తన ఆంగ్లనువాదంతో “ది వర్సెస్ ఆఫ్ వేమన” అనే గ్రంధాన్ని వెలువరించారు. తర్వాత రాజమహేంద్రవరం, తిరుచినాపల్లి,చిత్తూరు, కడప మొదలైన ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే తెలుగు సాహితీ వ్యాప్తికి అహర్నిశలు కృషి చేశారు. బ్రౌన్ దొరకు అజరామరమైన కీర్తిని సాధించి పెట్టినవి ఆయన రచించిన తెలుగు- ఆంగ్లం నిఘంటువు,ఆంగ్లం- తెలుగు నిఘంటువు బహుభాష నిఘంటువులు నేటికీ ప్రామాణికంగా ఉన్నాయి.

**బ్రౌన్ సేకరించిన జాబులు పదహారు సంపుటాలు**

**నాటి తెలుగుదేశపు సాహితీ చరిత్రకు ఆనవాలుగా నిలుస్తున్నాయి.**

కాలగర్భంలో కలిసిపోతున్న ప్రాచీన ఆంధ్ర కావ్యాలు, వ్యాకరణ శాస్త్రాలు, అనువాదాలు,పద్య శతకాలు మొదలైన వాటన్నింటినీ సేకరించి భద్రపరిచారు. రెండు వేల వేమన పద్యాలను సేకరించి, వెంకట శివశాస్త్రి,అద్వైత బ్రహ్మశాస్త్రి వంటి పండితుల సహాయంతో అర్థ వివరణ ఇచ్చి తెలుగు సాహిత్యానికి మహోపకారం చేశారు. మనం నేడు చదువుతున్న, నేటికీ లభిస్తున్న వేమన పద్యాలు ఆయన కృషి వలన వచ్చినవే. అలాగే 1835లో సుమతి శతకం ఆంగ్లానువాదం,భాస్కర శతకం,విష్ణు పురాణం, సునంద పరిణయం, అనంతపురం రాజుల యుద్ధాలు,మిరాసి కథలు, తాతాచారి కథలు,1852లో వెలువరించిన ‘తెలుగు వాచకం’ తెలుగు సాహితీ సరస్వతికి బ్రౌన్ ప్రసాదించిన మణిభూషణాలు. సిపి బ్రౌన్ 1884లో బ్రిటన్ లో మరణించేనాటికి అక్కడి విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్ గా ఉన్నారు. మన మాతృభాష కాకపోయినా,మనం ద్వేషించే బ్రిటిష్ వ్యక్తిగా ఉన్నా కూడా మాతృభాష మీద,మన తెలుగు భాష మీద మమకారంతో తెలుగు భాష నేర్చుకొని తెలుగు భాషకు ఎనలేని కృషి చేసి, తెలుగు ప్రొఫెసర్ గా సేవలందించిన ఆయన వ్యక్తిత్వం ఎందరికో స్ఫూర్తిదాయకం.మన తెలుగు భాష వికాసానికి జీవితాంతం శ్రమించి, తెలుగు గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన సి.పి బ్రౌన్ మహాశయునికి మనం తలవంచి నివాళులు అర్పించవలసిందే.

## కాకినాడలో ఎయిడ్స్ అవగాహన దినోత్సవం




ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు అంతర్జాతీయ ఎయిడ్స్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఎం ఎస్ ఎస్ జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును మరియు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ అధికారులు డా. ఎం శ్రీదేవి, డా. కె హరిబాబు అధ్యక్షతన క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ ప్రశాంతశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా చాలా దేశాలు ఈ ఎయిడ్స్ మహమ్మారికి గురయ్యాయని వాటిలో మరి ముఖ్యంగా ఆఫ్రికన్ మరియు ఏషియాలోని కొన్ని ప్రాంతాలు ఇతర దేశాలతో పోలిస్తే అవగాహన లోపం వల్ల ఎక్కువగా వ్యాప్తి చెందాయి, ఎయిడ్స్ మహమ్మారి నుండి ప్రపంచాన్ని రక్షించాలి అంటే అవగాహన వాటికి సంబంధించిన రక్షణ చర్యలు ఏ విధంగా చేపట్టాలి అని ప్రతి ఒక్క వ్యక్తికి తెలియజేయడం బాధ్యత గల పౌరులుగా విద్యార్థుల మీద ఆధారపడి ఉంది అని ఇటువంటి అవగాహనకు ప్రపంచ ఆరోగ్య సంస్థ తో పాటు ఎన్నో ఎన్జీవోస్ గవర్నమెంట్ సంస్థలు మెడికల్ సంస్థలు కృషి చేస్తున్నాయి అని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మనోజ్ దేవ, డా.స్టీఫెన్, వరప్రసాద్, మహమ్మద్ నదీమ్, డా. అప్పారావు, ఉమారజిత, శ్రీనివాస్ తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొని ఎయిడ్స్ అవగాహన ప్రతిజ్ఞని మరియు ర్యాలీని నిర్వహించారు.

## వైర్లెస్ కమ్యూనికేషన్ పై సెమినార్



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఇంట్రడక్షన్ టు వైర్లెస్ కమ్యూనికేషన్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా ఐఐటి తిరుపతి నుండి డా. ఆర్. సర్వేంద్రనాథ్ హాజరై సెమినార్ టాపిక్ పై మాట్లాడారు. అనంతరం వీసీ ఆచార్య కె. పద్మరాజుతో ఐఐటీ తిరుపతి మరియు నన్నయ యూనివర్సిటీ మధ్య ఎంవోయూ పై చర్చించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పి వెంకటేశ్వరరావు, కోర్సు కోఆర్డినేటర్ బి సుధాకర్ అధ్యాపకులు విద్యార్థులు హాజరయ్యారు.

## కాకినాడలో కాలుష్య నివారణ దినోత్సవం



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు ప్రపంచ కాలుష్య నివారణ దినోత్సవం పురస్కరించుకొని జాతీయ సేవా సమితి యూనిట్ 1 మరియు 2 ఆధ్వర్యంలో క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ ముఖ్యఅతిథిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కాలుష్య నివారణకు మొక్కలను పెంచుతూ ఉన్న అటవీ మరియు ప్రకృతి ప్రదేశాలను పరిరక్షిస్తూ ఉండటం వల్ల రాబోవు తరాలకు మరియు ఇతర జీవరాసులకు ఒక మంచి ఆరోగ్యవంతమైన ప్రపంచాన్ని పంచగలుగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డా.శ్రీదేవి, డా. హరిబాబు మరియు విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆర్ట్:
సిహెచ్.ఎస్.ఎల్.
సాయిసింధు
ప్రిన్సిపాల్,ఆదిత్యసాయి
విద్యాసంస్థలు,
కొయ్యలగూడెం.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in